క్లుప్తంగా

జీసీజీటీఏ జిల్లా కార్యవర్గ ఎన్నికలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జిల్లా స్థాయిలో తూర్పు గోదావరి జిల్లా జీసీజీటీఏ(గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్) కార్యవర్గ ఎన్నికలు ఆదివారం దిగ్విజయంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా జి. చంద్రశేఖర్, సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.డి.మదీనా, ట్రెజరర్ కె.నాగ సూర్య నారాయణ ఎన్నికయ్యారు. జిల్లా స్థాయి ఎలక్షన్ ఆఫీసర్‌గా డాక్టర్ పి.హరేరామ ప్రసాద్ వ్యవహరించారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

ప్రకాశం నగర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష పార్టీలు, దళిత నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో గో బ్యాక్ అమిత్ షా నినాదంతో ఆదివారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు టి.అరుణ్, జె.సత్తిబాబు, దళిత నాయకులు కోరుకొండ చిరంజీవి, అంబటి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం అయిన అంబేడ్కర్ అంటే బీజేపీ ఆర్ఎస్ఎస్ నేతలకు ఎంత విద్వేషం ఉందో షా వ్యాఖ్యలు చూస్తే అర్థమవుతుందన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన షా హోం మంత్రి పదవిలో కొనసాగడానికి అనర్హుడని అభిప్రాయపడ్డారు.

ఏపీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఏపీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్‌గా డాక్టర్ యోగానంద్, ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎం ఎం.రాజేష్ వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ ఏవీ ప్రసన్నకుమార్(ఏరియా వెటర్నరీ హాస్పిటల్, రాజమహేంద్రవరం), జనరల్ సెక్రటరీగా డాక్టర్ కేఏస్‌వీ చంద్రమౌళి(వెటర్నరీడి స్పెన్సరీ, వాడపల్లి), కోశాధికారిగా డాక్టర్ ఎం.ధరిన్‌బాబు (వెటర్నరీ డిస్పెన్సరీ, రాజంపాలెం), ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.అరుణ(వెటర్నరీ డిస్పెన్సరీ, పుణ్యక్షేత్రం), జాయింట్ సెక్రటరీగా డా.షేక్‌జహంగీర్‌పీరా (వెటర్నరీడిస్పెన్సరీ, రంగంపేట) ఎన్నికైనట్టు యోగానంద్, రాజేష్ తెలిపారు.

ఇమామ్, మౌజన్ల జీతాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఆరీఫ్

ప్రకాశంనగర్: ఆదాయం లేని మసీదుల్లో ఇమామ్, మౌజన్లకు ప్రభుత్వం ఇచ్చే జీతాలను తక్షణమే విడుదల చేయాలని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఆరీఫ్ డిమాండ్ చేశారు. స్థానిక జాంపేటలోని కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ గౌరవ వేతనం పొందుతున్న మసీదులు 118 ఉన్నాయని, గత తొమ్మిది నెలలుగా జీతాలు లేకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 4 వేల పైచిలుకు పైగా మసీదుల్లో గౌరవ వేతనం అందించకపోవడం వెనుక మర్మం ఏమిటాని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గౌరవ వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణమే నేరవర్చాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో ఉదయం స్వామివారికి పూజలు చేసి, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం వ్రత పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మృత్యు కుహరాలు

- ప్రమాదకరంగా క్వారీ గోతులు
- పోతున్న అమాయకుల ప్రాణాలు
- ఇప్పటి వరకూ 25 మంది మృత్యువాత
- పోరాటాలు చేసినా పట్టించుకోని అధికారులు



మృత్యు కుహరాలుగా మారిన క్వారీ గోతులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని క్వారీ సెంటర్లో సుబ్బారావునగర్, సింహాచలం నగర్ తదితర ప్రాంతాల ప్రజలకు క్వారీ గోతులు శాపంగా మారాయి. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో సుమారు 150 అడుగుల మేర క్వారీలు తవ్విన యజమానులు నిబంధనల ప్రకారం పూడ్చివేయకుండా వదిలేయడంతో అవి స్థానికుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ గోతులు పూడ్చాలంటూ రెండున్నర దశాబ్దాలుగా పోరాటాలు సాగిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40 సంవత్సరాలపాటు క్వారీలు తవ్విన యజమానులు వాటిని పూడ్చివేయాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ విధమైన చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పటివరకూ సుమారు 25 మంది అమాయకులు క్వారీ గోతులకు బలైపోయారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ గోతులు పూడ్చాలంటూ పోరాటాలు చేసినా, న్యాయస్థానాలను ఆశ్రయించినా అధికారులు చేపట్టిన చర్యలు అంతంత మాత్రమే ఉంటున్నాయని గోతుల పూడిచే ప్రయత్నాలు మాత్రం పూర్తిగా చేయడం లేదంటూ స్థానికులు చెబుతున్నారు.

నిరసనలు చేపట్టినా..

అక్కడ ప్రజలు గతేడాది జల దీక్ష పేరుతో నిరసన చేపడితే అధికారులు త్వరలోనే చర్యలు చేపడతామంటూ మభ్యపెట్టి దీక్షను విరమింప చేశారని, గోతులు పూడ్చే కార్యక్రమం మాత్రం ఇప్పటి వరకూ పూర్తికాలేదని కార్మిక నాయకుడు, నగర పాలక సంస్థస్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు, మహిళలు ఏకతాటిపై పోరాటం సాగిస్తున్న క్వారీ సమస్యకు పరిష్కారం లభించడం లేదంటూ తెలిపారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రైవేటు యజమానులకు చెందిన భూముల్లో మాత్రమే క్వారీలు కావాల్సి ఉండగా ప్రభుత్వానికి చెందిన పుంతలు, మినహాయింపు భూములు ఎస్సీలకు ఇచ్చిన రెండు ఎకరాల పైబడిన భూములలో క్వారీలను తవ్వేశారని ఆయన ఆరోపించారు. గతంతో నగర కమిషనర్‌గా చేసిన విజయరామరాజు ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని ప్రణాళిక సిద్ధం చేశారని, కానీ కార్యరూపం దాల్చలేదన్నారు. తరువాత వచ్చిన దినేష్‌కుమార్ క్వారీ యజమానులతో సమావేశం నిర్వహించి గోతులను పూడ్చాలని ఆదేశాలిచ్చారని కొండబాబు తెలిపారు. ఇప్పటికైనా స్థానికంగా ఉన్న పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కల్పించుకుని ప్రత్యేక దృష్టి సారించి క్వారీ ఏరియాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గృహ నిర్బంధం

తాజాగా ఆదివారం క్వారీ గోతులు పూడ్చాలంటూ స్థానిక ప్రజలతో కలిసి మరోసారి నిరసన జల దీక్ష చేపట్టేందుకు నిర్ణయించుకున్న కొండబాబును రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నిరసనకు అనుమతులు లేవని, అనుమతులను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామంటూ పోలీసులు నోటీసులో జారీ చేశారు. నోటీసులు అందుకున్న కొండబాబు ఇంటికి పరిమితం అయ్యారు. ఈ విషయం తెలిసుకున్న స్థానికులు, మహిళలు పెద్ద ఎత్తున కొండబాబు నివాసానికి చేరకుని ప్రజలు క్వారీ గోతులను తక్షణమే పూడ్చి వేయాలని, గోతులు పూడ్చేంత వరకూ పోరాటం సాగిస్తామంటూ నిరసన నినాదాలు చేపట్టారు.



జలదీక్ష చేపట్టేందుకు బయలుదేరిన కొండబాబును హౌస్ అరెస్టు చేసిన త్రీ టౌన్ పోలీసులు

పర్యాటకంగా అభివృద్ధి చేస్తే..

సుమారు 100 ఎకరాల విస్తీర్ణం కలిగిన క్వారీ గోతులను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే జిల్లాకే తలమానికంగా తయారవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాజమహేంద్రవరంలో క్వారీ గోతుల్లో బోటింగ్ ఏర్పాటు చేస్తే జిల్లా వ్యాప్తంగా పర్యాటకంగా మరింత అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రభుత్వ ఆదిశగా ఆలోచన చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

హైవేను దిగ్బంధం చేస్తాం



ఏళ్ల తరబడి క్వారీ గోతులు పూడ్చాలంటూ పోరాటాలు సాగిస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు, రెవెన్యూ, మైన్స్ అధికారులు మభ్యపెడుతున్నారు తప్ప చర్యలు చేపట్టడం లేదు. క్వారీ గోతుల్లో నీరు తోడేంచేలా చర్యలు తీసుకోవాలి. గోతులు పూడ్చి వేయాలి. చర్యలు తీసుకోకుంటే ప్రజలతో కలసి జాతీయ రహదారి దిగ్బంధనం చేస్తా. ఉన్నతాధికారులు కల్పించుకుని చర్యలు చేపట్టాలి.

– బర్రే కొండబాబు, నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్

అమాయకుల ప్రాణాలు బలి



ఏళ్ల తరబడి క్వారీ గోతుల్లో పడి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారు 130 అడుగుల లోతు ఉండే గోతుల్లోకి జారిపడిన వాళ్లు పైకి వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా స్థానికంగా ఉండే పేదలు ప్రాణాలను క్వారీ గోతులు తీసేస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి పేదల ప్రాణాలు కాపాడాలి. నా తెలిసి ఇప్పటి దాకా పాతిక మంది దాకా మృత్యువాత పడ్డారు.

– గారా నూకరత్నం, సుబ్బారావు నగర్, రాజమహేంద్రవరం

సరదాగా.. సందడిగా..



గార్డెన్ పార్టీలో పాల్గొన్న యజమానులు

రాజమండ్రి మైక్, లైటింగ్ ఓనర్స్ కుటుంబ సభ్యుల గార్డెన్ పార్టీ

రాజమహేంద్రవరం రూరల్: పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, జాతరలు ఇలా ఫంక్షన్ ఏదైనా వారి మైకు, సౌండ్ సిస్టం వినిపించాల్సిందే. వారు అమర్చే రంగురంగుల విద్యుద్దీపాలంకరణ కనువిందు చేయాల్సిందే. వృత్తి రీత్యా ఎప్పుడూ ఏదో ఒక ఫంక్షన్ తో తీరిక లేకుండా ఉండే ది రాజమండ్రి మైక్ అండ్ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు ఆటవిడుపుగా తమ కుటుంబ సభ్యులతో గార్డెన్ పార్టీకి వెళ్లి సరదాగా సంతోషంగా గడిపారు. వృత్తిలో ఉండే అలసటను మరిచి హాయిగా సేద తీరారు. ఆదివారం పాత బొమ్మూరులోని జీపీఆర్ లేఅవుట్ గేటు ఎదురుగా ఉన్న రామకృష్ణ తోటలో జరిగిన ఈ వన సమారాధనలో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలకు, పిల్లలకు ప్రత్యేక ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుల్లివల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పొట్నూరి వసంతకుమార్, కోశాధికారి బెవర రామారావు సారథ్యంలో జరిగిన ఈ గార్డెన్ పార్టీకి కొల్లి గణేష్, కోనా శ్రీను, సారిక శివకుమార్, మోతా వీరాస్వామి, కె.చిట్టిబాబు, ఎస్.రాహుల్, పల్లెడ ప్రకాశరావు, పారామౌంట్ ఎలక్ట్రానిక్స్, సీహెచ్ శ్రీనివాసరావు, బొట్ల సూర్యారావు, ఆల్తి రమణ, కిరణ్ సహకరించారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరవు

రూ.2 కోట్ల రోడ్డును పట్టించుకునేవారేరీ!



కడియపులంకలో నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద సీసీ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కోట్లాది రూపాయలను వెచ్చించి నియోజకవర్గంలో పనులు మొదలయ్యాయి. అయితే కూటమి నాయకులు ప్రమేయం ఎక్కువగా ఉండడంతో ఆయా నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు కూడా అధికారులు అటువైపు చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల్లో పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, పంచాయతీరాజ్ నిధులతో జరుగుతున్న ఈ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ సిబ్బంది స్వీయ పర్యవేక్షణ ఉండాలి. అయితే సంబంధిత అధికారులు కార్యాలయాలకు మాత్రమే పరిమితమవుతున్నారంటున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలకు కూడా వెళ్లడం లేదంటున్నారు. ఇందుకు నిదర్శనంగా కడియం మండలం కడియపులంక పంచాయతీ పరిధిలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద నుంచి దోసాలమ్మ కాలనీ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న సీసీ రోడ్డు నాణ్యత అంతంత మాత్రంగా ఉంది. ఇదే రోడ్డులోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిర్మాణంలో ఉండగానే రోడ్డు కృంగిపోవడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. నిర్మాణ పనులు సాగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో రోడ్డు కొంత మేర కృంగిపోయింది. దీనికి ప్యాచ్ వర్క్ చేసి దానిని కప్పిపుచ్చే ప్రయత్నాలు చేశారు. దీనిపై కొబ్బరి పీచును పరిచి, క్యూరింగ్ చేస్తున్నారు. దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులు జరుగుతుండగానే, ఎటువంటి భారీ వాహనాలు ప్రయాణించకుండానే ఇలా కృంగిపోతే పది కాలాల పాటు ఈ రోడ్డు ఉంటుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎర్త్ వర్క్ నాసిరకంగా..

రోడ్డు నిర్మాణం చేసే సమయంలో ఎర్త్ వర్క్‌ను నాసిరకంగా చేయడం కారణంగానే రోడ్డు ఇలా కృంగిపోయిందంటున్నారు. ఉపాధి హామీ నిధులు కావడంతో సీసీ రోడ్డు క్వాలిటీ కంట్రోల్ పరిశీలన అనంతరం మాత్రమే బిల్లులు పూర్తిగా చెల్లిస్తారు. అయితే రోడ్డు క్రింది భాగంలో చేసే ఎర్త్‌వర్క్‌ను ఇంజినీరింగ్ సిబ్బంది స్వయంగా పర్యవేక్షించి, నాణ్యతో జరిపించాలి. అధికారులు పర్యవేక్షణ కరువవ్వడంతో ఎర్త్‌వర్క్‌ను నాసిరకంగా పూర్తిచేసి, దానిపై సీసీ రోడ్డును వేస్తున్నారని, అందు వల్లనే రోడ్డు కృంగిపోతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు నాణ్యతపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడియం: ఒకటి కాదు రెండు కాదు 25 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆప్యాయంగా ఆనందంగా రోజంతా గడిపారు. కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకూ (1995 నుంచి 2000)చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, ఆత్మీయంగా పలకరించుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులు ప్రధానోపాధ్యాయిని సుబ్బలక్ష్మి, ఇంగ్లీష్ టీచర్ కుమారి, హిందీ టీచర్ సూర్య బేగం, లెక్కల టీచర్ శ్రీనివాస్, బయాలజీ అరిగెల సూరిబాబు, గుమాస్తా జోషి, నైట్ వాచ్మెన్ రమణమ్మలను ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమాచారాన్ని సేకరించి విజయవంతం చేసిన కాదంబరి సూర్య శ్రీనివాసరావు, పేకెటి బ్రహ్మజీ, దొడ్డ సూరిబాబు, సిద్దిరెడ్డి భాను ప్రకాష్, పాతంశెట్టి రాజేష్ చెక్కపల్లి సతీష్, అక్కివరపు నాగసత్యం, పాతంశెట్టి సత్యవతి, గట్టి అనిత, గ్రంధి హిమబిందులను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం శివరత్నగణపతి, కొత్తపల్లి శివాజీ, చెక్కపల్లి శివరామకృష్ణ పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో యోగి వేమన జయంతి



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్న రాముడు తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జీవిత సత్యాలను పద్యాల రూపంలో అందించిన మహోన్నత వ్యక్తి యోగి వేమన అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం యోగి వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ చిన్న రాముడు మాట్లాడుతూ వేమన ఎన్నో భోగభాగ్యాలు అనుభవించి, అవి ఏవీ జీవిత సత్యాలు కాదని తన రచనలు ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తిత్వం ఉన్న వారన్నారు. ఆయన రచనల ద్వారా జీవితా సత్యాలను తెలుసుకుని భావితరాలకు అందించే ప్రయత్నం ప్రతి ఒక్కరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, కలెక్టరేట్ ఏవో ఎండీ ఆలీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

సీటీఆర్ఐ: స్థానిక సంజీవనగరంలో జూలి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఉదయం సుగర్ ఫాస్టింగ్ టెస్ట్ నిర్వహించిన తరువాత అక్కడే వారికి అల్పాహారం ఏర్పాటు చేసి గంట గడచిన తరువాత తిరిగి మళ్లీ సుగర్ టెస్ట్ చేశారు. సుగర్‌తో బాధ పడేవారికి మందులతో పాటు ఆహారంలో మార్పులను సూచించారు. సుమారు వందకి పైగా పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జూలి అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు రెవరెండ్ జూలి అమ్మ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితం ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విమల, అభిషేక్, సుభాషిణి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'జీమా' వార్షికోత్సవం

- నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం
- జిత్ మోహన్ మిత్రకు నటగాయక పరిపూర్ణ బిరుదుతో సత్కారం



జీమా నూతన కార్యవర్గంతో జిత్ మోహన్ మిత్ర, గౌతంరాజు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (జీమా) ఏడో వార్షికోత్సవం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నట గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షత వహించగా, సినీ హాస్య నటులు గౌతమ్‌రాజు, దర్శకులు ఆనంద సాగర్, ఎస్ఎస్ స్వామి, బాబీ, జీమా ఫౌండర్ కె.మహేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం జీమా అధ్యక్షుడు డీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎంఎస్ చక్రధర్, కేవీ వీఎస్ అవధాని, కార్యదర్శి డి.సురేంద్ర, కోశాధికారి పిచ్చుక మహేష్, జాయింట్ సెక్రటరీ ఎం.రామసాయిలతో ప్రమాణ స్వీకారం చేసింది. సినీ నటుడిగా, గాయకుడిగా, ఆర్కెస్ట్రా పితామహుడిగా జీవితాన్ని సాఫల్యం చేసుకున్న జిత్ మోహన్ మిత్రకు జీవిత సాఫల్య పురస్కారంగా నట గాయక బిరుదుతో జీమా సభ్యులు సత్కరించారు. పలువురు పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, ముద్రగడ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియమకానికి పరీక్ష



పరీక్ష రాస్తున్న రేషను షాపు డీలర్ అభ్యర్థులు

రాజానగరం: డివిజన్‌లో రేషన్ షాపు డీలర్ల నియమాకమానికి స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఆదివారం పరీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఖాళీలున్న 145 షాపులకు డీలర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా 487 దరఖాస్తులొచ్చాయని స్థానిక తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి తెలిపారు. పరీక్షకు మాత్రం 465 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తరణ

జిల్లా సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రానున్న కాలంలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తామని తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలో రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న వారందరికీ ఆమె చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడు ముందుంటుందన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వివిధ సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగానే ఒక రోజు ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ శిక్షణలో 26 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ దల్ సింగ్, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్లు మహాలక్ష్మి, కేవీ రమణ, బండి వెంకటేశ్వరరావు, ట్రైనర్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మను దర్శించుకున్న సినిమా డైరెక్టర్ కృష్ణారెడ్డి

బిక్కవోలు: కొంకుదురు చిన్నం వంశీయుల ఇలవేల్పు అయిన సత్తెమ్మ తల్లి అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సినిమా డైరెక్టర్, చిన్నం కుటుంబ అల్లుడు ఎస్వీ కృష్ణారెడ్డి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం కృష్ణారెడ్డిని గ్రామస్తులు సత్కరించారు. సత్తెమ్మ తల్లీ అమ్మవారి సంబరంతో చిన్నం వంశీయులకు మరో పండగా వాతావరణం కనిపిస్తోంది. ఎక్కడ ఉన్న ఈ సంబరం రావడం చిన్నం వంశీయులు, ఆడపడుచులు కుటుంబాలతో వచ్చి అమ్మవారి దర్శించుకుంటారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

సీతానగరం: రఘుదేవపురంలో పేకాట ఆటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. రఘుదేవపురం గ్రామ శివారున పేకాటాడుతుండగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

కొట్లాటపై కేసు నమోదు

ముగ్గళ్లకు చెందని గెడ్డం అనిల్ కుమార్‌ను కొట్టినందుకు పెనుగుల రవిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గత నెల 31వ తేదీన రాత్రి అనిల్‌కుమార్ తన ఇంటి వద్ద ఫ్లెక్సీ కడుతుంటే పెనుగుల రవి, మరి కొంత మంది వచ్చి కొట్టగా బాధితుడు రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందారని, ఆసుపత్రి సమాచారం, కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.